**శ్రీ రమణ జ్యోతి** **Sri Ramana Jyothi**

ఫిబ్రవరి 2020 February 2020

ఈ సంచికలో ... IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కే.యస్. గారి 67వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | **అమరత్వ చేతన** | డా॥ తోట శ్రీనివాస్ | 9 |
| 3. | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 14 |
| 4. | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరిరావు | 18 |
| 5. | **శ్రీరమణుల దారి** | దోనెపూడి వెంకయ్య | 24 |
| 6. | **శ్రీరమణ మహర్షి సూక్తులు** | కమలాకర వెంకటరావు | 26 |
| 7. | Nature: A Silent Teacher | Dr.K. Subrahmanian | 30 |
| 8. | Do Parayana When You Walk | Vimal Balasubrahmanyan | 34 |
| 9. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 37 |
| 10. | Lest We Forget - Sri J Krishna Murthy | G.Sri Hari Rao | 40 |
| 11. | Marriages | Suri Nagamma | 44 |
| 12. | Keeping A Promise | | 46 |
| 13. | Bhakthi | K.R.K. Murthy | 48 |


**Events in Sri Ramana Kendram in February 2020**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 7th February - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.
4. 8th February (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# శ్రీరాముడు సుగుణాభిరాముడు

డా॥ కే.యస్. గారి 67వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## సుగుణాల రాశి

మనకందరికీ, రామాయణం పరిచయమైనదే. ధర్మాన్ని ఎప్పుడూ తప్పకుండ నడుచుకొనడం శ్రీరాముని ప్రత్యేకత. శ్రీకృష్ణునిది పూర్ణావతారం అంటారు. తాను అవతార పురుషుడినని ఆయనకు తెలుసు, అందుకే ఎన్నో అద్భుతాలను చూపించాడు. శ్రీరామచంద్రుడిని వాల్మీకి ఒక ఆదర్శప్రాయుడైన మానవుడిగా చిత్రించాడు. స్వయంగా శ్రీరాముడే, "నేను మానవుడిని, దశరథ మహారాజు పుత్రుడిని" అని చెప్పుకున్నాడు. మానవ రూపంలో వున్న అతను ధర్మం పరిధిలోనే అసాధారణమైన కార్యాలను నిర్వర్తించాడు. స్వాభావికంగానే అతను మంచివాడు, దయాశీలుడు కాని వాల్మీకి ఏ మానవుడైనా అన్ని సుగుణాలను కలిగివుంటాడా, అని ప్రశ్నిస్తూ, రామచంద్రుని గుణగణాలను ఏకరువు పెడతాడు.

సూక్ష్మంగా, వాల్మీకి రామాయణంలో విశదీకరించబడిన మౌలిక అంశం-తపస్సు: సీతకోసం శ్రీరాముని తపస్సు; శ్రీరాముని కోసం సీత తపస్సు; శ్రీరాముని కోసం దశరథుని తపస్సు; శ్రీరాముని కోసం భరతుని తపస్సు - అలాగ సాగుతూ పోతుంది. ఏదో ఒక కారణం కోసం ఇలా తపస్సు కొనసాగుతుంది. ప్రధానంగా, రామాయణం శ్రీరాముని, సీతమ్మ యొక్క దుఃఖం, బాధలను వివరిస్తుంది. సంతోషపూరితమైన అనుభవాలు రామాయణంలో

అగుపడువు. వాల్మీకి, నారదుడితో, ''ఎవరైనా ఒక్క మంచితనమే గాకుండ, శ్రీరామునిలాగ ఇతర సుగుణాలను కలిగినవారున్నారా అని తెలుసుకొనాలని వుంది'' అన్నారు. 'పరాక్రమం', 'ధైర్యం', ధర్మాధర్మాల వివేచన చూపే 'ధర్మజ్ఞత', 'సత్యవ్రతం', శ్రీరామునిలో పుష్కలంగా కనిపించే 'కృతజ్ఞతాభావం', కృతజ్ఞత వీటన్నిటికీ కూడ శ్రీరామునిది పెట్టింది పేరు.

ముఖ్యంగా కృతజ్ఞత ఈ ప్రపంచంలో అరుదైన సుగుణం. అవతలి వ్యక్తికి లక్ష రూపాయలు ఇచ్చినప్పటికీ, నిజంగా తృప్తి వుండకపోవచ్చు. మరికొంత ధనం ఇవ్వొచ్చుకదా అన్న ఆశ వుండవచ్చు. నిజంగా కృతజ్ఞతను ప్రదర్శించడమంటే ''ఇక ఇవ్వకండి, నేను తీసుకొనలేను'' అని అనగలిగినప్పుడు. ఎవరికైనా అన్నదానం చేసినప్పుడు అతను ఒక దశలో, ''ఇక చాలు, తృప్తి చెందాను'' అని అంటాడు. మనకు కృతజ్ఞతను తెలుపుతాడు. అందుకే మన పూర్వీకులు అన్నదానం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

ఒకప్పుడు ధర్మారాజు భీష్మునితో, ''మీరు అన్నదానం చేయమని నాకు చెప్పారు. కాని అలాగ చేస్తున్నప్పుడు కొందరు సోమరులను మేపుతున్నానన్న అభిప్రాయం నాకు కలుగుతోంది. వాళ్ళు పరాన్నజీవులని నాకు అనిపిస్తుంది. అన్నదానం చేయడం వృథా'' అన్నాడు. జవాబుగా భీష్ముడు ''కొందరు సోమరులు అందులో వుంటారన్నమాట నిజవే కావచ్చు. వాళ్ళను ప్రోత్సహిస్తున్నామన్న మాట కూడ నిజం కావచ్చు. కాని ఈ విషయమై ప్రతి ఒక్కరినీ సూక్ష్మంగా పరిశీలించి అర్హులను నిర్ణయించడమన్నది



సాధ్యమైన పని కాదు. నీవు ఒక వెయ్యిమందికి అన్నదానం చేసినప్పుడు అందులో ఒకరిద్దరు నిజమైన సాధువులు వుండవచ్చు. మంచివారు కావచ్చు. వారికి ఆహారం అత్యవసరమై వుండవచ్చు. అలాంటివారి దీవెనలు నీకే కాదు, నీకు ముందు, నీ తరువాత, ఆరు తరాల వారికి లభిస్తాయి. నిజంగా అలాగ విమర్శిస్తూపోతే, నీ అన్నదానానికి ఎవరూ అర్హులు కాకపోవచ్చు'' అన్నాడు.

## మూర్తీభవించిన ధర్మం

శ్రీరాముడు అమితమైన కృతజ్ఞతను కనబరిచేవాడు. మనకు సహాయం చేసినవారి పట్ల మనం కూడ అలాంటి భావన చూపించాలి. లంక నుండి తిరిగి వచ్చిన హనుమంతుడు సీత క్షేమంగా వుందన్న శుభవార్తను శ్రీరామునికి విన్నవించుకున్నాడు. వెంటనే శ్రీరాముడు, ''హనుమాన్, ఇంతమంచి వార్త తెచ్చినందుకు నీకు ఇవ్వడానికి ప్రస్తుతం నా దగ్గర ఏమీ లేదు'' అంటూ హనుమ దగ్గరికి వెళ్ళి, కన్నీళ్ళు కారుస్తూ గాఢంగా కౌగిలించుకున్నాడు.

అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు సీతమ్మకు ఒక ముత్యాలహారం ఇచ్చాడు. కావాలంటే, ఆమెకు ఇష్టమైన ఎవరికైనా దాన్ని బహుమతిగా ఇవ్వవచ్చునన్నాడు. సీత ఆ దండను హనుమంతునికి ఇచ్చింది. హనుమంతుడు రామునితో ''ప్రభూ, మీకు కృతజ్ఞుడిని. నేనేమీ చేయలేదు. నాకేమీ వద్దు. కాని ఏమైనా ఇవ్వదలచుకుంటే, నాకు ఒక వరం ఇవ్వండి. ఇంకెవ్వరూ నాకంటే మీ పట్ల ఎక్కువ భక్తిని కనబరచకుండేలాగు వరాన్ని ఇవ్వండి'' అన్నాడు. దానికి బదులుగా శ్రీరాముడు ''హనుమా! నీవు నాకు చేసినంతగా మరెవ్వరూ ఇన్ని రకాల

సహాయాలు చేయలేదు. అసలు నీ మొదటి సహాయానికే నేను నా ప్రాణాన్ని ఇచ్చి తీర్చుకోవలసి వుంటుంది. కాని మరి అలాగైతే, మిగిలిన వాటికై నేను ఏ విధంగా ఋణం తీర్చుకోవాలి?" అన్నాడు. అంతటి ధర్మమార్గ ప్రవర్తన ఆయనది. అందుకే శ్రీరాముడు 'మూర్తీభవించిన ధర్మం' అని పేరు పొందాడు.

శ్రీరాముడు నిత్య సత్యవ్రతుడు. ఒకప్పుడు తనకు దశరథుడు ఇచ్చిన వరాల ఆధారంగా, భరతునికి పట్టాభిషేకం చేయాలనీ, శ్రీరాముడిని 14 ఏళ్ళు వనవాసం పంపాలనీ కైకేయి పట్టుబట్టింది. మరుసటి రోజు వుదయమే పట్టాభిషిక్తుడు కావలసిన శ్రీరాముడిని వనాలకు వెళ్ళవలసిందిగా విధిలేక దశరథుడు ఎంతో దుఃఖంతో కోరాడు. భరతుడు రాజ్యాన్ని పరిపాలిస్తాడన్నాడు. దానిని ఆజ్ఞగా తీసుకున్న రాముడు తొణకక, బెణకక, తండ్రి మాటను పాటించ డానికి వెంటనే సిద్ధమయ్యాడు. ఈ వార్తను తెలిపిన శ్రీరాముడిని తల్లి కౌసల్య వనవాసం చేయవద్దని పలు విధాల నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. ఆఖరుకు కన్నకొడుకు లేని తన పరిస్థితి అంతః పురంలో ఎంత దయనీయంగా వుండబోతుందో కూడా వివరించింది. కాని తండ్రికి ఇచ్చిన మాటను జవదాటితే తాను మాట తప్పినవాడినవుతాననీ, సత్యవాక్పాలన తన ధర్మమనీ చెప్పి తల్లిని బలవంతంగా ఒప్పించి, ఆమె ఆశీర్వాదాలను పొందుతాడు.

ఇక్కడ పిల్లల విషయంలో తల్లుల మనస్తత్వం గురించి ఒకటి చెప్పుకోవాలి. నాకు ఇప్పుడు అరవై ఏళ్ళు దాటినప్పటికీ, నేను బయటికి వెళ్ళే ప్రతిసారీ, మా అమ్మ నేను ఎక్కడికి వెళ్తున్నాను,



ఎప్పుడు తిరిగి వస్తానన్నది తెలుసుకు తీరుతుంది. చెప్పిన సమయానికి రాకుంటే, వచ్చేదాకా, భోజన సమయం దాటినప్పటికీ కాచుకుని వుంటుంది. నా తల్లి ఒకామె మాత్రమే కాదు. అందరి తల్లులూ అదే ఆదుర్దాను ప్రదర్శిస్తారు. అందరిదీ అదే లక్షణం.

## భరతుని రాక

శ్రీరాముడు చిత్రకూటంలో వున్న సమయంలో భరతుడు సైన్యంతో సహా అక్కడికి వస్తున్న వార్త తెలిసింది. భరతుని ఉద్దేశాన్ని శంకించిన లక్ష్మణుని శాంతపరిచి భరతుడు తమను చంపడానికి రావడం లేదనీ, ఉత్తముడైన అతడు తనను ఏమీ కోరడనీ అన్నాడు. ఆఖరుకు "అతడు రాజు అయ్యాడని నీకు ఈర్ష్యగా వుందా? నీకు రాజ్యం కావాలనుకుంటే భరతునిది ఇవ్వగల స్వభావం" అంటాడు. వచ్చిన భరతుడు శ్రీరాముడిని తిరిగి అయోధ్యకు రమ్మని వేడుకుంటాడు. తండ్రి మాట మేరకు అరణ్యానికి వచ్చిన వాడు ఆయన ఆజ్ఞను శిరసావహించాడు. కనుక మళ్ళీ అయోధ్యకు రావచ్చునని వాదిస్తాడు. కాని తండ్రి వనవాసకాలాన్ని కూడ నిర్ణయించాడు గనుక ఆయన మాటను పూర్తిగా పాటించి తీరాలని శ్రీరాముడు భరతుని విజ్ఞప్తిని నిరాకరిస్తాడు.

పై సంఘటన జరిగిన సమయంలో అక్కడ వున్న ఋషి జాబాలి కైకేయి ధర్మాన్ని పాటించలేదు గనుక ఆమె ఆజ్ఞను పాటించ వలసిన అవసరం శ్రీరామునికి లేదనీ, అయోధ్యకు రావచ్చుననీ అంటాడు. కట్టలు తెంచుకు వచ్చిన కోపంతో శ్రీరాముడు, ఋషి అయినందువల్ల జాబాలిని ప్రాణాలతో వదిలిపెడుతున్నానన్నాడు.

ఎవరైనా సరే, ధర్మాన్ని ఒక నీతిగా పాటించాలనీ, ప్రాపంచిక లాభాల కోసం అధర్మ మార్గంలో వెళ్ళరాదనీ గట్టిగా మందలిస్తాడు. మధ్యలో కలుగజేసుకున్న వశిష్ఠుడు శ్రీరాముడిని శాంతపరుస్తాడు. శ్రీరాముడు ఎంత ఖచ్చితంగా ధర్మానికి కట్టుబడి వుండేవాడో ఇవి మనకు తెలియజేస్తాయి.

**మానవ పాత్రపోషణ**

శ్రీరాముడు మానవరూపం ధరించి, మానవ సహజ గుణగణాలను ప్రదర్శించాడు. అలాంటి పాత్రను పోషించాడే కాని తానే ఆ పాత్ర అని ఎప్పుడూ భావించలేదు. ఆయన వనవాస సమయంలో, సీత కోసం పరితపిస్తున్న శ్రీరాముని చూపిస్తూ పార్వతి, ఈశ్వరునితో, "శ్రీరాముడు అవతారమూర్తి. కాని సాధారణ మానవునిలాగ రోదిస్తున్నాడు. అతడేమీ గొప్పవాడు కాడు" అని అన్నది. అందుకు పరమేశ్వరుడు శ్రీరాముడు తన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడే గాని, అతని హృదయంలో దుఃఖం లేదన్నాడు. పరీక్షించదలచుకుంటే పార్వతిని సీత రూపంలో శ్రీరాముని మార్గంలో నిలబడమన్నాడు. పార్వతి అలాగే చేసినప్పుడు అంత వరకూ విపరీతంగా ఏడుస్తున్న రాముడు, వెంటనే, "పార్వతీ మాతా! మీరు ఇక్కడ ఏమి చేస్తున్నారు?" అని ప్రశ్నించాడు. పరమేశ్వరుడు అన్నది అక్షరాలా నిజమని పార్వతీదేవి అంగీకరిస్తుంది. శ్రీరాముడు సకల సుగుణాభిరాముడు.

తరచు, రామాయణాన్ని పఠిస్తే, మనకూ అంతా భగవంతుని లీల అని అర్థమౌతుంది. ఆయన కృపతో సమస్యలను తట్టుకునే శక్తిని సంపాదించగలుగుతాము కూడ.



# అమరత్వ చేతన

(గత సంచిక తరువాయి) - డా. తోట శ్రీనివాస్

బ్రం: ధ్యానానికి ఉపకరించే మందులు ఏమైనా ఉన్నాయా?

భ: లేదు. అవి ఉపయోగించేవాడు వాటికి అలవాటు పడి అవి లేనిదే ధ్యానానికి ఉపక్రమించడు.

ఓపియం, గంజాయి మరియు ఆల్కహాల్ తీసుకునే వాళ్ళు, వాటికి అలవాటు పడి వాటికి బానిసలయి ఏదో లోకంలో, ఏదో మైకంలో విహరిస్తూ ఆత్మానందాన్ని అనుభవిస్తున్నామనుకుంటారు. అది ముమ్మాటికి అబద్ధం. తాగిన మత్తు దిగగానే మళ్ళీ త్రాగాలనే బలమైన వాంఛ వాళ్ళను బానిసలుగా మార్చి బలహీనులుగా వదిలేస్తుంది. కృతకమైన ఆ వస్తువులు చాలా ప్రమాదమైనవి. ఒకసారి మనసు జాగృతమైతే చాలా శక్తివంతమవుతుంది. మనసును నిగ్రహించాలి. వాస్తవాన్ని గ్రహించాలి.

## జీవకారుణ్యం

ఇక జంతువుల గురించి:

భగవాన్ యొక్క జంతు ప్రేమ చాలా అసామాన్యమైనది. ఒకరోజు భగవాన్‌ను తేలు కుట్టింది. వారు దానికి ఈ విధంగా స్పందించారు:

నేను తెలియకుండా తేలుమీద అడుగుపెట్టాను. అది దాని అస్థిత్వాన్ని తెలియజేయడం కోసం నన్ను కుట్టింది. జంతువు తన్ను తాను రక్షించుకోవడం కోసం మాత్రమే ఇతరులపై దాడి చేస్తుంది. కాని మనిషి ఏం చేస్తున్నాడో మనకు తెలుసు.

జంతువులు కూడా మనుషుల్లా ఆలోచిస్తాయి. అవి బుద్ధిలేని జీవులు అని అనుకోరాదు. అక్కడున్న ఆవును చూపిస్తూ వారు కూడా మనలాగా తెలివిగా ఆలోచిస్తారు.

ఓ రాత్రి ఆశ్రమం చూరు నుండి ఓ పాము క్రింద పడింది. మహర్షి ఓ లాంతరు తెచ్చి దానికి బయటకు దారి చూపు మన్నారు. దానికి ఏలాంటి అపాయం కలిగనీయవద్దని ఆశ్రమ వాసుల్ని వారించారు. ఆశ్రమంలో చాలాసార్లు పాములు తిరగడం చూసి, మనం వాటి దగ్గర కొచ్చాం. అవి మన దగ్గరకు రాలేదు. వాటిని ప్రశాంతంగా ఉండనీయండి అని అన్నారట.

## బ్రహ్మచర్యం గురించి...

బ్రం: అసలు కోరికలు అంటే ఏమిటి?

భ: అవి ధ్యానానికి పురికొల్పే శక్తిలాంటివే కాని వాటి మార్గాలు గతి తప్పుతాయి.

ఓ భక్తుని వివాహం గురించి తెలియజేశారు భగవాన్‌కు.

బ్ర: ఆయన ఎందుకు పెళ్ళికి నిర్ణయించుకున్నారు, అది ఒక అడుగు వెనక్కు వేయడం కాదా?

భ: భగవాన్ నవ్వుతూ, ఆయన ఆధ్యాత్మిక ప్రగతికి పెళ్ళి అవరోధం అవుతుందా? ఆకలి, దప్పికలాంటి శారీరక కోరికలు తీర్చుకొననిదే ధ్యానం ముందుకు సాగదు. ఆత్మవిచారణ ఫలితం, ధ్యానం, ఆత్మశక్తి, ఏకాగ్రత ఇంద్రియ నిగ్రహం, వైరాగ్యం, ఋజు ప్రవర్తన, ఇవన్నీ తరువాతే.

బ్ర: బ్రహ్మచర్యం అవసరం కాదా?



భ: బ్రహ్మచర్యమనగా 'బ్రహ్మంలో నివసించడం'. దీనికి మీరన్న బ్రహ్మచర్యంతో సంబంధం లేదు. నిజమైన బ్రహ్మచారి బ్రహ్మలో లీనం కోసం తపిస్తాడు. అంటే తన ఆత్మతో తాదాత్మ్యం చెందుతాడు.

బ్రం: బ్రహ్మచర్యం యోగాభ్యాసంలో అవశ్యం కాదా?

భ: ఔను అవసరమే. ఆత్మసాక్షాత్కారానికి కావలసిన చాలా ఉపకరణాల్లో అదొకటి.

బ్రం: బ్రహ్మచర్యం చాలా ముఖ్యమైనది కాదంటారా? గృహస్థ ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలడా?

భ: తప్పకుండా పొందగలడు. బ్రహ్మచారయినా, గృహస్థయినా ఆత్మ సాక్షాత్కారం ఇప్పుడే, ఇక్కడే పొందగలడు. దానికి కావల్సింది మానసిక పరిపక్వత. సంసారంలో భార్య, పిల్లలతో ఉంటూ ఆత్మసాక్షాత్కారం పొందిన వాళ్ళు ఈ ప్రపంచంలో ఎంత మంది లేరు?

బ్రం: ముక్తికి బ్రహ్మచర్యం మంచిదా, గృహస్థాశ్రమం మేలా?

భ: నువు ఏది మంచిదనుకుంటే అది మంచిది. రెంటి మధ్య తేడా లేదు. ఆలోచనలు అరికట్టి, కారణాలను కట్టిపెట్టి సాధన చేయండి. ధ్యానంలో వ్యక్తిగత అనుభూతి ముఖ్యం కాని కారణం కాదు. అది ఛాతీ కుడి భాగం నుండి రావాలి, తలనుంచి కాదు, ఎందుకంటే అది హృదయం స్థానం. ఆ స్థానాన్ని గట్టిగా అదిమి పట్టుకోవాలి.

బ్రం: వివాహం ఆధ్యాత్మిక సాధనకు అడ్డంకా?

భ: గృహస్థుని జీవితం లడ్డంకి కాదు, కాని గృహస్థులు చాలా

నిగ్రహం పాటించాలి. ఆధ్యాత్మిక ఉన్నతిని పొందాలన్న బలమైన కోరిక ఉంటే మిగతా కోరికలన్నీ వాటంతట అవే జారిపోతాయి. ఒక్కసారి మనసును లేకుండా చేస్తే మిగతా వన్నీ సమసిపోతాయి.

బ్రం: స్త్రీ సాంగత్య కోరికల్ని ఎలా త్యజించాలి?

భ: శరీరం, ఆత్మ రెండూ ఒకటే అనే ఆలోచనను నిర్మూలించాం. ఆత్మలో సంగమ కోరిక ఎక్కడిది? నువ్వే ఆత్మగా భావిస్తే ఇక సాంగత్య కోరిక ఎక్కడిది?

బ్రం: మీరు సాంగత్య కోరికల్ని అణుచుకోవడాన్ని నమ్ముతారా?

భ: నిజమైన బ్రహ్మచారి నిరంతరం బ్రహ్మంతో రమిస్తుంటాడు. అప్పుడు వేరే కోరికలు ఉద్భవించడం అంటూ జరుగదు.

బ్రం: అరవిందుని ఆశ్రమంలోకి భార్యాభర్తలు, ఏలాంటి శారీరకమైన సంబంధం పెట్టుకోని వాళ్ళనే అనుమతిస్తారు. ఈ నిబంధనను ఖచ్చితంగా పాటించాల్సిందే.

భ: దానివల్ల ఫలితమేమి? వాళ్ళ మనసుల్లో ఆ బలమైన కోరిక ఉంటే ఎవరో నియంత్రించడం వల్ల లాభమేమి?

బ్రం: కుటుంబ నియంత్రణ అమరత్వానికి దారితీస్తుందా?

భ: సమస్యల మూలాలు వెతకాలి. జన్మ యొక్క వాస్తవ కారణం తెలుసుకొని నివారించాలి. అది నిగ్రహం వల్ల జరగాలి, ఇంద్రియ నిగ్రహం వల్ల జరగాలి. ఈ జన్మ ఎవరికీ? ఒక ప్రాచీన శ్లోకం ఏమంటుందంటే, ''కోర్కెల సమిధల్లో ఎంత వేసినా మండుతూనే ఉంటాయి''. కాబట్టి కోర్కెల మూలాల్ని,



కారణాలను అంతర్గతంగా వెతికి నియంత్రించాలి. నైతిక నియంత్రణ పాటించాలి.

బ్రం: ఒక్క నిగ్రహం వల్ల మాత్రమే కుటుంబ నియంత్రణ సాధ్యమవుతుందా?

భ: ఔను! మిగతా పద్ధతులన్ని తాత్కాలిక ఉపశమనంగా పనిచేస్తాయి.

బ్రం: పిల్లల్ని కనాలనే కాంక్ష మరియు శారీరక సుఖం అనుభవించాలన్న కాంక్షల ఘర్షణలో సతమతమవుతున్నప్పుడు దేనికి ప్రాముఖ్యత నివ్వమంటారు?

భ: ఏదో ఒక విషయంలో నువు నిగ్రహం పాటించాలనుకున్నప్పుడు రెండు విషయాల్లో అదే నిగ్రహం పాటించవచ్చు కదా? ప్రకృతి నియమాల్తో ఎందుకు జోక్యం చేసుకుంటావు? ప్రకృతి నియమాల్ని ఏర్పరిచినదాన్ని, దానిపని దాన్ని చేయనివ్వు. లైంగిక వాంఛలు మనుషుల్లో ఇప్పటికే బలంగా ఉన్నాయి. ఇంకా బలపరచడం దేనికి? ప్రకృతి సత్యాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే లైంగిక కోరికలు చెలరేగవు. నీలో ఉన్న భిన్నత్వపు మానసిక స్థితిని నువ్వు నిర్మూలించగలిగితే, లైంగిక కోర్కెలకు అదే మూలం కావున, అవి నిర్మూలించ బడతాయి.

కొంతమందికి సంతానం కాదు. కొంతమందికి చాలామంది పిల్లలుంటారు. నువు, పిల్లలను పుట్టకుండా నియంత్రించాలనుకుంటే మనుషులు చావకుండా కూడా ప్రయత్నం చేయవచ్చు కదా (భగవాన్ నవ్వుతూ...) మనమంతా పిల్లలుగానే ఎప్పుడూ ఉంటే, ప్రపంచమంతా ఎంత ఆనందంగా ఉండేదో! *(సశేషం)*

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# ప్రొ॥ శిష్టా సుబ్బారావు గారు

మల్లాది ఫణిమాల

ప్రొ॥ శిష్టా సుబ్బారావు గారు 1909లో జన్మించారు. వారు బందరు హిందూ కాలేజీలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పనిచేశారు. ఆధ్యాత్మిక మార్గంలో శ్రీ శిష్టా సుబ్బారావుగారి మొదటి ఉపదేశకులైన శ్రీరామారావు పంతులు గారి ద్వారా, వారికి శ్రీ భగవాన్ గురించి ప్రప్రథమంగా, 1936లో తెలిసింది. శ్రీరమణాశ్రమంలో జరిగిన ఒక ఉదంతాన్ని వారు శిష్టా సుబ్బారావుగారికి చెప్పారు. ఆ ఉదంతాన్ని గురించి వినగానే సుబ్బారావుగారికి భగవాన్ నిగూఢ శక్తి గురించి నమ్మకం కలిగింది. ఆ ఉదంతం ఏమంటే శ్రీరమణాశ్రమం గదిలోకి ఒక త్రాచు వచ్చిందట. ఎంతోమంది గుమిగూడి దానిని తరిమివేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయానికి శ్రీ భగవాన్ అక్కడికి వచ్చి ఆ సర్పాన్ని ఉద్దేశించి, "ఇక్కడున్నవారంతా భయపడుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపో" అన్నారు. శ్రీ భగవాన్ అన్న మాటలు వినగానే ఆ త్రాచు అక్కడి నుండి వెళ్ళిపోయింది. పంతులు గారు ఈ ఉదంతాన్ని చెప్పి, సుబ్బారావుగారి కంటిచూపు అప్పటికే క్షీణిస్తూండటం వల్ల, శ్రీ భగవాన్ అనుగ్రహం వల్ల నయం కావచ్చు అని సూచించారు.

సుబ్బారావుగారు 1936 జూన్ 3న శ్రీ భగవాన్‌ను దర్శించి వారి పాదపద్మములకు మొక్కి, క్షీణిస్తున్న కంటిచూపును గురించి విన్నవించుకున్నారు. అంతర్దృష్టి కలిగితే, వారి బాహ్యదృష్టి బాగు పడుతుంది అని భగవాన్ అన్నారు. భగవాన్ అన్న ఈ మాటలు



సుబ్బారావుగారికి అర్థం కాక, కాస్త వివరించి చెప్పమని భగవానులను వేడుకున్నారు. "బయటి చూపు లేకపోవటమంటే లోపలి చూపు కలగటం" అని భగవాన్ వివరించారు. అప్పుడు సుబ్బారావుగారు, ఆ అంతర్దృష్టిని పొందే విధానం గురించి బోధించమని శ్రీ భగవానులను ప్రాధేయపడ్డారు. భగవాన్ అనుగ్రహించారు. అప్పటివరకు సుబ్బారావుగారిని పెనుభూతం వలె పీడిస్తున్న కంటిచూపు సమస్య వారిని బాధించక, వారి దృక్పథాన్ని మార్చివేసింది. మహర్షి ఉపదేశ ప్రభావం వల్ల, అప్పటి నుంచీ కంటిచూపుని మెరుగుపరచుకుందామన్న సమస్య వెనక్కి వెళ్లిపోయింది. సుబ్బారావుగారు లోదృష్టి పొందటానికి సాధనని మొదలుపెట్టారు.

ఒకనాటి సాయంత్రం ధ్యానం చేసుకుంటూండగా, సుబ్బారావు గారికి ఒక విచిత్ర అనుభవం కలిగింది. వారి శ్వాస దీర్ఘమై, శబ్దం కూడ వచ్చింది. వారి దేహం తేలిక అయిపోయి, తొడల మీద ఉన్న వారి చేతులు గాలిలో తేలిపోసాగాయి. వారి దేహంలో ప్రతి కణమూ కంపించిపోతున్నట్లనిపించి, వారికి వర్ణనా తీతమైన ఆనందం కలిగింది. బాహ్యస్మృతి మాత్రం పోలేదు. కాస్సేపటి తరువాత వారి దేహమూ, శ్వాస మామూలుగా అయ్యాయి. సుబ్బారావుగారు వారి బసకి వెళ్ళిపోయాక భక్తులు శ్రీ భగవాన్‌ను వారికి ఏమి జరిగిందని అడిగితే, సాధన తీవ్రతని లోపల తట్టుకోలేక బయటపడ్డారని, శ్రీ భగవాన్ అన్నారు.

సుబ్బారావుగారి భౌతిక చూపు మెరుగుపడుతున్న సూచనలేమీ లేకపోగా, వారి ఆర్థిక పరిస్థితి ఎంతగానో దిగజారిపోవటం వారిని ఎంతగానో కృంగదీసింది. చూపు పూర్తిగా పోయే అవకాశం కూడా

ఏర్పడింది. వారిమీదే పూర్తిగా ఆధారపడ్డ భార్యను తలచుకుని చింతించడమే గాక, వారికి ఆత్మహత్య చేసుకునే ఆలోచనలు కూడా తరచూ కలిగేవి. గిరిచుట్టూ ఉన్న అనేక తటాకాలలో, ఏదో ఒకదానిలో పడి, ప్రాణాలు తీసుకుందామని వారికి అనిపించేది కూడా.

ఈ వివరాలన్నీ శ్రీ భగవానులకు విన్నవించుకుని, పరిష్కారం సూచించమని అడగడానికి సుబ్బారావుగారికి ధైర్యం సరిపోలేదు. భగవాన్ చుట్టూ ఎల్లప్పుడూ భక్తులు ఉంటూనే ఉండటం వల్ల, ఏకాంతంగా వారితో మాట్లాడే అవకాశం లేకపోవటం ఒక కారణమైతే, వారి వ్యక్తిగత, ప్రాపంచిక విషయాల గురించి చెప్పి శ్రీ భగవాన్‌ని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేకపోవటం మరొక కారణం. కానీ వేరే మార్గం తోచక, గత్యంతరం లేక, ఒకనాడు మధ్యాహ్నం సుబ్బారావుగారు తమ భౌతిక, మానసిక, ఆర్థికస్థితుల గురించి భగవానులకు విన్నవించుకుని, వారి అనుగ్రహాన్ని అర్థిస్తూ, ఒక కాగితం మీద వ్రాసి వారికి ఇచ్చారు. భగవాన్ కాగితం మీద సుబ్బారావు గారు విన్నవించుకున్నదంతా చదివి, ఆ కాగితాన్ని సుబ్బారావుగారికి తిరిగి ఇచ్చేశారు.

జీవితంపట్ల సుబ్బారావుగారి దృక్పథంలో మార్పు వచ్చింది. ''దుఃఖం పొందటం ఈ జన్మలోనో, గత జన్మలోనో చేసిన పనులకు ఫలితమని, ప్రతీవారు ఆ ఫలితాన్ని అనుభవించి తీరాలని, ఆత్మహత్య చేసుకోవటమంటే జీవితంలోని చేదు నిజాల నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నించే ఒక పిరికితనమనీ, వారికి అనిపించింది. జీవితం పట్ల మారిన ఈ దృక్పథం వల్ల ఆత్మహత్యా ప్రయత్నాలతో నిండిపోయిన వారి ఆలోచనలన్నీ అంతమయ్యాయి.



సుబ్బారావుగారు ఇక జీవిత పోరాటాన్ని ఎట్లాగైనా కొనసాగించటానికి సన్నద్ధులయ్యారు. ఈ ఉదంతం వల్ల మహాత్ములు, భక్తుల మానసిక స్థితిలో అద్భుతమైన పరివర్తనం తీసుకురాగలరని సుబ్బారావుగారికి అర్థమైంది.

1940-41 సం॥లో శ్రీ భగవాన్ జయంతి ముందువారిపై ఒక సంస్కృత శ్లోకం వ్రాయాలని ప్రేరణ కలిగిన సుబ్బారావుగారు ఒక శ్లోకాన్ని రచించి, ఆశ్రమ సర్వాధికారికి పంపారు. సర్వాధికారి జయంతి వేడుకలలో ఆ శ్లోకాన్ని చదివారనీ, అందరూ మెచ్చుకున్నారనీ, సుబ్బారావుగారికి జవాబు వ్రాశారు. ఆ శ్లోకం తాత్పర్యమిది:

''అరుణాచల అంచులపై నివసిస్తూ జ్ఞానభాస్కరులూ, ఆనందరూపులూ అయిన శ్రీరమణులు అనాయాసంగా ఆత్మవిద్యని ఉపదేశించారు. అనన్య సామాన్యమూ అమేయమూ అయిన ఈ సద్గురువుని సదా చింతింతును''.

మనసు మూలంలో ఉండటానికి వారు చేసే ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని శ్రీ భగవాన్‌కి చెప్పి, వారి ఆశీర్వాదాన్ని అర్థించారు శ్రీ సుబ్బారావుగారు. శ్రీ భగవాన్ ''ఏమిటి అడ్డు'' అని అడిగితే, ''పాతుకుపోయిన నా వాసనలు'' అని సుబ్బారావు గారు జవాబు ఇచ్చి, శ్రీ భగవాన్ అనుగ్రహాన్ని అర్థించారు. విడువ కుండా వాసనలు తొలగించుకొనే దిశగా సాధన కొనసాగించమనీ, మన సంక్షేమాన్ని చూచుకునే భగవంతునికి వారి బాధ్యతని జ్ఞాపకం చేయాల్సిన అవసరం లేదనీ, సమయం పక్వమైనప్పుడు భగవంతుని అనుగ్రహం ఫలిస్తుందనీ, శ్రీ భగవాన్ సుబ్బారావుగారికి బోధ చేశారు. *(మూలం: శ్రీరమణ మహర్షితో ముఖాముఖి)*

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 10. శ్రీరమణులచే పిల్లల నామకరణ ఉత్సవాలు

నేను శ్రీరమణాశ్రమంలో పని చేయడం ఆరంభించేసరికి, నాకు ఇద్దరు మగసంతానం. ప్రతిసారీ బిడ్డ పుట్టినపుడు నేను, నాగూ శ్రీభగవాన్ ఆశీర్వాదం కోసం ఆశ్రమం వెళ్ళేవారం. నా ముగ్గురు మగపిల్లలకూ, నలుగురు ఆడపిల్లలకూ నామకరణం చేసింది శ్రీ భగవానే. ప్రతిసారీ సరైన పేరు నిర్ణయించేవారు. తన నిర్ణయానికి కారణం కూడా తెలియచెప్పేవారు.

నా మొదటి సంతానం మగపిల్లవాడు, 1934 మే 29. కీలపసలై గ్రామంలో పుట్టినపుడు నేను బిడ్డను పాతహాలుకు తీసుకువెళ్ళి శ్రీభగవాన్ పవిత్ర హస్తాలలో వుంచాను. బిడ్డకు పేరు పెట్టమని అలమేలత్త శ్రీభగవాన్‌ను కోరింది. శ్రీభగవాన్ తలెత్తి చూసేసరికి, అపుడే హాలులోకి వస్తున్న ఆశ్రమవాసీ, వినయశీలీ అయిన భక్తుడు సుందర ఆర్యపై ఆయన దృష్టి పడింది. శ్రీభగవాన్ చలోక్తిగా "చూడండి! బిడ్డకు 'సుందరం' అని పేరు పెట్టమని చెప్పడానికి మన సుందర ఆర్య వస్తూ వున్నారు' అన్నారు. అలా శ్రీభగవాన్ 'సుందర రమణన్' అనే పేరు నిర్ణయించారు.

రెండవ సంతానం కూడా మగపిల్లవాడే. 1936 సెప్టెంబరు 19న కందుకతాన్‌లో హాస్పిటల్‌లో పుట్టాడు. శ్రీభగవాన్ దగ్గరకు బిడ్డను తీసుకు వెళ్ళినపుడు చిరునవ్వు నవ్వి, 'ఈ బిడ్డకు పేరు పెట్టడం చాలా తేలిక. ఈయన పేరుతోనే పుట్టాడు" అన్నారు. మా అందరికీ ముందు



అర్థం కాలేదు. తర్వాత తెలిసింది. పిల్లవాడు గణేశ చతుర్థినాడు పుట్టి నందుకు, శ్రీభగవాన్ అతనికి 'గణేశన్' అని పేరు పెట్టదలచారు.

తర్వాత సంతానం కూడా మగసంతానమే. 1939 ఫిబ్రవరి 8వ తారీఖున పుట్టాడు. అప్పటికి మా కుటుంబం తిరువణ్ణామలైకు మారి పోయింది. బాబును శ్రీభగవాన్‌కు చూపించినపుడు, నవ్వి "ఈయనకు పేరు పెట్టడం కూడా తేలికే. గణేశన్‌కు తమ్ముడు కదా! పేరు మీకే తెలుసు" అన్నారు. ఆ విధంగా మా మూడవ బిడ్డకు 'సుబ్రమణియన్' అని నామధేయం చేశారు శ్రీభగవాన్. అతన్ని అందరూ ముద్దుగా 'మణీ' అని పిలుస్తారు. 1941 జనవరి 17న మా కుటుంబంలో ఆడపిల్ల ప్రవేశించింది. బిడ్డను చేతులలోకి తీసుకున్న శ్రీభగవాన్ "మనింట్లో పుట్టిన మొదటి ఆడపిల్ల. సంప్రదాయం ప్రకారం వాళ్ళ నాయనమ్మ, అమ్మమ్మ పేర్ల ప్రకారం 'అలఘు' అనిగాని, 'అలిమేలు' అనిగాని పేరు పెట్టాలి. కానీ, ఈమెకు నేను మా నాయనమ్మ పేరు 'లక్ష్మి' అని పేరు పెడతాను. మా నాయనమ్మ ఎంతో నిస్వార్థ జీవి. కుటుంబం కోసం తన జీవితం ధారపోసింది. ఇపుడు వెంకిటూ ఇంటికి వచ్చింది" అన్నారు. మేమంతా చాలా ఆశ్చర్యభరితులమై విన్నాము. ఈ విధంగా మా పెద్దమ్మాయికి 'లక్ష్మి' అని పేరు పెట్టబడింది.

మా రెండవ అమ్మాయి 1944 మార్చి 22న పుట్టింది. ఆమెకు శ్రీభగవాన్ వాళ్ళమ్మ పేరు 'అలఘు' అని పేరు పెట్టారు. మూడవ అమ్మాయి, 1946 నవంబరు 23న పుట్టింది. ఆమెను శ్రీభగవాన్ దగ్గరకు తీసుకు వెళ్ళినపుడు 'మొదటి ఇద్దరు ఆడపిల్లలకు మా నాయనమ్మ, అమ్మ పేర్లు పెట్టాం. ఈ పాపకు వెంకిటూ తల్లి పేరు పెట్టకపోతే ఆమె బాధపడుతుంది కదా! కాబట్టి, ఈమెకు వెంకిటూ తల్లి పేరు పెట్టాలి" అన్నారు. ఆ విధంగా మూడవ అమ్మాయి పేరు

'మంగళం' అయింది. నన్ను రెండేళ్ళకే విడిచి వెళ్ళిన మా అమ్మ పేరు అది.

మా నాల్గవ ఆఖరి అమ్మాయి 1949 మే 19న పుట్టినపుడు సాధు కుమారస్వామిగారు, మరికొందరు పాపను తీసుకెళ్ళి శ్రీభగవాన్ చేతుల్లో పెట్టారు. హాలులో చాలామంది 'అలమేలు! అలమేలు!' అని గొణగ సాగారు. నన్ను పెంచిన అలమేలత్త పేరు శ్రీభగవాన్ నిర్ణయిస్తారని అందరూ అనుకొన్నారు. కానీ శ్రీభగవాన్ చిరునవ్వుతో "కాదు, కాదు. మా నాయనమ్మ, అమ్మ, వెంకిటూ తల్లి పేర్లు ఇంతవరకూ నిర్ణయించాం. కాబట్టి ఇపుడు పాపకు వాళ్ళ అమ్మమ్మ పేరు పెట్టాలి. పాప పేరు 'సరస్వతి' అన్నారు. మా అత్తగారి పేరు సరస్వతి.

1949 జూలైలో, శ్రీరమణాశ్రమానికి దగ్గరగా రూపొందుతున్న కాలనీ రమణ నగర్‌లో మా సొంత ఇంటికి, ఊళ్ళో వుండే వసతి గృహం నుండి మారిపోయాం.

## 11. రమణ మహర్షి సహజ నిష్ఠ

తన తమ్ముని మనుమలపట్ల, మనవరాళ్ళపట్ల శ్రీభగవాన్‌కు వున్న ప్రేమ అసామాన్యం. చూసేవారికి ఇది సాధారణం అని తోచవచ్చుగానీ, నిజానికి ఆ ప్రేమ ఒక పరిపూర్ణమైన విరాగి వెదజల్లు అలౌకికమైన విశిష్ట ప్రేమ. అందరూ ఆయన పిల్లలే.

నా భార్య నాగూ రెండేళ్ళ గణేశన్‌ను ఒళ్ళో పెట్టుకొని హాలులో కూర్చునేది. బిడ్డ ఒళ్ళో నుండి లేచిపోయి, శ్రీభగవాన్ సోఫా దగ్గరకు నడిచిపోయి వారి కాళ్ళ పట్టుకొని పైకెక్కడానికి ప్రయత్నించేవాడు. దగ్గరున్న పరిచారకుడు బిడ్డను ఎత్తుకు వెళ్ళి, నాగూ ఒళ్ళో వదిలి, "శ్రీభగవాన్ చుట్టాన్ని అన్న అధికారం నిలుపుకోవాలనా ఏమిటి?"



అనేవాడు. పాతహాలుకు గణేశన్‌ను తీసుకు వెళ్ళినపుడల్లా ఇదే జరిగేది.

ఒక రోజున గణేశన్‌ను తీసుకు వెళ్ళినపుడు అదృష్టవశాత్తు, ఆ నిరంకుశ పరిచారకుడు హాల్లో లేడు. రాబర్ట్ బ్రూస్ కథలో సాలీడు లాగ, గణేశన్ అనేక ప్రయత్నాల తర్వాత ఎలాగో సఫలీకృతుడై, పైకి ఎక్కి శ్రీభగవాన్ కాళ్ళ వద్ద కూర్చున్నాడు. ఆ చంటివాడు కింద పడిపోకుండా శ్రీభగవాన్ వానిని తన ఎడమ కాలితో పట్టుకొని కుడికాలితో బిడ్డ తలపై నెమ్మదిగా రాసి, "ఎప్పటినుండో ప్రయత్నిస్తున్నాడు. ఇవ్వాళ వాడిని ఎవరూ ఆపలేదు. తన పంతం నెగ్గించుకున్నాడు" అన్నారు. తన చివరి రోజులదాకా, నాగూ ఈ సంగతి చెబుతూనే వుండేది.

గణేశన్‌కు ఐదేళ్ళ వయస్సు. అమెరికాకు చెందిన భక్తురాలు ఎలియనార్ పాలీన్ నోయ్‌కి బాగా దగ్గరయ్యాడు. భోజనాల సమయానికి ముందే పిల్లలందరికీ వంటశాలలో అన్నం పెట్టేసేవారు. ఒక రోజున, ఆమెను అంటి పెట్టుకుని వుండి, ఆమె చేయి పట్టుకొని భోజనశాలకు వచ్చాడు. నోయ్‌గారికి ఎదురుగా ఆమె విస్తరి వద్దనే కూర్చొని, అదే ఆకులో భోజనం చేస్తానని మారాం చేస్తున్నాడు. ఎవరో అతన్ని ఎత్తుకొని వంటశాలవైపు తీసుకువెళ్ళబోతే పెద్దగా ఏడవసాగాడు. తను మామూలుగా కూర్చునే స్థానంలో వున్న శ్రీ భగవాన్ ఇదంతా చూశారు.

'ఏమిటి విషయం?' అన్నట్లు ఆ మనిషి వంక చూసారు. గణేశన్ వంటింట్లో భోజనం చేయనంటున్నాడు. నోయ్‌గారి విస్తట్లోనుంచే తింటాడట!' అని వివరించాడతను. శ్రీభగవాన్ ఒకింత పరికించి చూసి, చిరునవ్వుతో ఇలా అన్నారు, "లోపలికి వచ్చి తిననని కాదు. ఇంతవరకూ

తను ఎవ్వరినీ స్పూన్‌తో తినడం చూడలేదు. నోయ్‌గారి స్పూన్ అతనికి నచ్చింది. ఆకులో భోజనం పెట్టి, దానిలో ఒక స్పూన్ పెట్టి పిలవండి. వస్తాడో, రాడో చూడండి''. వంటశాలలో మనుష్యులు శ్రీ భగవాన్ చెప్పినట్లే చేసారు. గణేశన్ వెంటనే వంటశాలకు నడిచి వెళ్ళాడు.

ఆ అల్లరి పిల్లవాడిని, శ్రీ భగవాన్ ఒక తాతలాగ దారికి తెచ్చారా లేక ఒక జ్ఞానిలాగానా? నాకు అర్థమైనంతవరకు రెండు విధాలా!

1944లో శ్రీ భగవాన్ భుజం వద్ద ఎముక విరిగింది. ఒక ఉడుతను కుక్క తరుముతుండగా, దానిని రక్షించబోయి శ్రీభగవాన్ పడిపోయారు. డాక్టరుగారు ఆయన చేతికి కట్టు కట్టారు. ఆ మరుసటి రోజు నేను పిల్లలతో ఆశ్రమానికి వెళ్ళాను. మా మూడవ అబ్బాయి, మణి, శ్రీభగవాన్‌కు సాష్టాంగ నమస్కారం చేశాడు. శ్రీభగవాన్ కట్టు చూసి, పరిచారకులపట్ల తన ఆగ్రహం వ్యక్తం చేసాడు. ''శ్రీభగవాన్ వెనుకనే భక్తులు నడుస్తుంటారు. వాళ్ళందరూ ఏమి చేస్తున్నట్లు? శ్రీభగవాన్ పడిపోకుండా చూసుకోవద్దా?'' అప్పటికి మణి వయస్సు ఆరేళ్ళు. అతని మాటలు విని, శ్రీభగవాన్ ముక్కుమీద వేలు వేసుకుని, ''మణి చాలా చలాకీ పిల్లవాడు. ఎంత చక్కగా మాట్లాడుతున్నాడు!'' అన్నారు.

ఒకసారి మురుగునార్ హాలులోకి వచ్చి, శ్రీభగవాన్‌కు నమస్కరించి కూర్చున్నారు. ఒక పాప వంక శ్రీభగవాన్ తదేకంగా చాలాసేపు చూడడం గమనించారు. అలా చూడడం చాలా అరుదు, విశేషం. మురుగనారే కాదు, మిగతా భక్తులకు కూడా, అది చాలా అరుదైన సన్నివేశమని తెలుసు.

మురుగనార్ శ్రీభగవాన్ దగ్గరకు వెళ్ళి, వినయంగా, ''శ్రీభగవాన్! మీ దయాదృష్టిని పొందగలిగిన ధన్యురాలు ఎవరా అదృష్టవంతురాలైన



పాప?'' అని అడిగారు. ''ఆ పాప మీకు తెలియదా? మన లక్ష్మి'' అన్నారు శ్రీభగవాన్. ఈ సంఘటన పదేపదే గుర్తు తెచ్చుకొనేవారు శ్రీమురుగనార్. 'మన' అనే పదం శ్రీభగవాన్ చాలా అరుదుగా వాడేవారు. ఆ పదానికి చాలా గూఢార్థం వుంది. వెంకిటూ కూతురు లక్ష్మి ఎంత అదృష్టవంతురాలు! ఎంత ధన్యురాలు! శ్రీభగవాన్‌తో 'మన' అనిపించుకున్నది. ఆమెపై తాతగారు ఇలా తన ప్రత్యేకమైన దీవెనలు కురిపించారా?

శ్రీభగవాన్ మహానిర్వాణం ముందు జరిగిన ఇంకొక సంఘటన కూడా, హృదయం కదిలించి వేస్తుంది. శ్రీభగవాన్ ఎడమ చేతిపై పెరిగిన రాక్షసి పుండు చాలా పెద్దదై పోయింది. చేతికి కట్టు కట్టారు. ఎంతోమంది వైద్యులు శ్రీభగవాన్‌కు చికిత్స చేస్తున్నారు. అక్కడ గుమిగూడిన జనంలో చాలామంది ముఖ్యులు వున్నారు. అలమేలత్త, మా ఆఖరి పాప పదకొండు నెలల వయస్సు గల సరస్వతిని ఎత్తుకొని శ్రీభగవాన్ దగ్గరకు వెళ్ళింది. పాప 'ఇంగా, ఇంగా' అని శబ్దాలు చేస్తోంది. కానీ, ఎప్పటికంటే చాలా గట్టిగా అరుస్తోంది. అత్త, పాపను శ్రీభగవాన్‌కు దూరంగా తీసుకువెళ్ళింది. కానీ, పాప మాటలు శ్రీభగవాన్‌కు వినిపించాయి. దేహంలో, ఏ భాగానికైనా ఇసుమంత కదలిక కలిగితే శ్రీభగవాన్‌కు భరించలేని బాధ కలిగేది. కానీ, వారు తన తల అన్ని వైపులా తిప్పి, 'ఇంగా' పాప మాట వినిపించిందే! ఇక్కడ వుందా? పాపం! గొంతెత్తితే చాలు దూరం తీసుకుపోతారు'' అన్నారు.

ఎవరో పరుగున వెళ్ళి, అలమేలత్తను, పాపను శ్రీభగవాన్ దగ్గరకు తీసుకువెళ్ళారు. శ్రీభగవాన్ పాప వంక ఎంతో దయతో చూసి 'ఇంగా' అన్నారు. పాపకూడా 'ఇంగా' అన్నపుడు శ్రీభగవాన్ వదనం చిరునవ్వుతో నిండిపోయింది. *(సశేషం)*

# శ్రీరమణుల దారి

- దోనెపూడి వెంకయ్య

1. శ్రీరమణులదారి దరిజేర్చునట్టి దారి
దూరమేలేని దారి
తీరు అదే ఐన దారి అరుణాచలా
దారి కాని దారి అది అరుణాచలా ॥

2. స్వర్గాంగ జలముల స్నానమే ఈ రమణ
మార్గానుసరణము
నిర్గమద్వారమై అరుణాచలా
త్రివర్గదూరమై అరుణాచలా

3. సకల ప్రశ్నలలోని సారాంశమును తేల్చ
ఒకే ఒక ప్రశ్నయే
సకలమునకు మూలము అరుణాచలా
తికమకలే లేవు అరుణాచలా ॥

4. నేనెవడనని చూచి లోని తత్త్వము నెఱుగ
నేను బద్ధుడగాను
నే నిత్యముక్తుడను అరుణాచలా
జ్ఞానమిదే కనుము అరుణాచలా ॥

5. విచలితంబగుచున్న వెఱ్ఱి మనసును గూర్చి
విచికిత్స యొనరింప
అచలమై మనసుండు అరుణాచలా
అబలమౌ మనసాత్మ అరుణాచలా ॥

6. మతిని మతి తోడన్ మట్టుపెట్టును ప్రశ్న
వెతక నే నెవడనని
మతితో ప్రశ్నయు అణగు అరుణాచలా
చితిని గాల్చుకట్టెయై అరుణాచలా ॥

7. వశమగును చిత్తము స్వైర వృత్తిని మాని
భృశముగా ప్రశ్నింప
కశాఘాతమౌ ప్రశ్న అరుణాచలా
అశని సమమగు ప్రశ్న అరుణాచలా ॥

8. నక్రగ్రహమువోలె నాది నేనను తలపు
ఆక్రమణమొనరించె
ఆ క్రమము కోసివేయి అరుణాచలా
నీ క్రకచము నేనెవడను అరుణాచలా ॥

9. కీలు కనుగొని మనః ఖేలన మడంపగా
వాలాయమగు వాలు
శూలాయుధము వోలె అరుణాచలా
కాలాహి ఈ ప్రశ్న అరుణాచలా ॥

10. విచ్చు కత్తిగ ప్రశ్న వెతకి మనసును పట్టి
తెచ్చి వ్రేటున గూల్చ
చచ్చునది తక్షణమె అరుణాచలా
చచ్చుదది పుచ్చుదది అరుణాచలా ॥

11. దివ్వె వెలిగినట్లు నవ్వు నవ్వినయట్లు
దవ్వే లేనియట్లు
క్రొవ్విరి చిదిమినట్లు అరుణాచలా
ఎవ్వడ నేనని కనుట అరుణాచలా ॥

12. మగ్గము నేసినట్లు మరల మరల ఏల
అగ్గిపుల్ల గీచి వేయి
బుగ్గి యగును అహంత అరుణాచలా
అగ్గిపుల్ల నేనెవడను అరుణాచలా ॥

# శ్రీరమణ మహర్షి సూక్తులు

- కమలాకర వెంకటరావు

## అరిషడ్వర్గ విజయం

కామాది అరిషడ్వర్గాన్ని ఎలా నిగ్రహించడం? ఈ ఉద్వేగాలు ఎవరివో కనుక్కో. నీవు ఆత్మస్థుడవై ఉండగలిగితే ఆత్మకంటె వేరుగా నీకేదీ కనిపించదు. అప్పుడు నిగ్రహించడమనే ప్రసక్తికే అవకాశం వుండదు.

## 'అసలు నేను'

'అసలు నేను' చూడబడే వస్తువు కాదు, చూడబడేది, చూచేది, చూపు - మూడూ దాని అభివ్యక్తులు. ఆత్మ సాక్షాత్కారంలో చూడబడేది ఏమీ ఉండదు. ఎరుకయే దాని స్వస్వరూపం. దాని వెలుగులోనే శరీరం, అహంకారం, ప్రపంచం మొదలైనవన్నీ ప్రకాశిస్తాయి.



## 'అసలు నేను' అనుభవం

'అహం బ్రహ్మాస్మి' - అనే భావం ఏకాగ్రత కొక సాధన. ఇతర భావాలను అది నివారించి, తానొక్కటే నిలుస్తుంది. కాని, ఆ భావం ఎవరిదో విచారించు. 'మాయ నేను' స్వరూపమేమిటో పరిశీలించు. అప్పుడది అంతర్ధానమై 'అసలు నేను' స్వయంప్రకాశమానంగా అనుభవానికి వస్తుంది. అటుపిమ్మట ఇక ఏ ప్రయత్నంతోనూ పని లేదు.

## అసలు సమస్య

అహంకారాన్ని వదిలించుకోడమే సత్య సాక్షాత్కారానికి సూటి మార్గం. అహంకారానికి వస్తుత్వం లేదు కనుక దాని నిజ స్థితి విచారించగానే అది అంతర్ధానమై సత్యం దానంతటది సాక్షాత్కరిస్తుంది. అహంకారాన్ని అట్టిపెట్టుకుంటూ సత్య సాక్షాత్కారం పొందగోరే యితర మార్గాలు అనేక సందేహములకు ఆలవాలములై అసలు సమస్య చిట్ట చివరకు మిగిలే వుంటుంది. పైన చెప్పిన సూటి మార్గంలో అసలు సమస్య మొదటే పరిష్కారమౌతుంది.

## 'అహం' - 'అహంకారం'

ఒకే 'అహం' ఎప్పుడూ ఉన్నది. అప్పుడప్పుడు బయలుదేరేది 'అహంకారం'. అభివ్యక్తం కాకముందు కూడా 'అహం' స్వయంప్రకాశమానంగా ఎప్పుడూ ఉండనే ఉన్నది. స్థూలదేహం పుట్టుక మన పుట్టుక కాదు. అహంకారం పుట్టుకయే మన పుట్టుక. ముక్తికి క్రొత్తగా సంపాదించుకునేది ఏమీ లేదు. అది మన స్వతస్సిద్ధమైన స్థితి, ఎప్పటికీ అది మార్పు లేకుండానే ఉన్నది.

### అహంకారం - ఆత్మ

అహంకారం లేకుండా ఆత్మ ఉండగలదు. ఆత్మ లేకుండా అహంకారం ఉండలేదు. వాటి సంబంధం నీటి బుడగకూ మహా సముద్రానికి గల సంబంధం వంటిది. అహంకారపు మూలం తెలుసుకుంటే ఆత్మ తెలియబడుతుంది.

### అహం - ఇదం

'అహం-ఇదం', - 'నేను-ఇది' - అనేవి ఒక దానిపై ఒకటి ఆధారపడి విడివిడిగా ఉన్నట్టు ఇప్పుడు కనిపిస్తున్నాయి. కాని, వాస్తవానికి అవి విడివిడిగా లేవు. 'నేను' లోనే 'ఇది' వ్యాపించి వున్నది. 'ఇది' అనేది 'నేను'లో లీనమై దానితో ఒకటై పోవాలి. అప్పుడు మిగిలి వుండే 'నేనే' 'అసలు నేను'.

### అహంకారపు నిజస్వరూపం

అహంకారపు విశుద్ధ స్వరూపం రెండు అవస్థలకు, లేక రెండు భావాలకు, మధ్య నుండే విరామకాలంలో తెలియబడుతుంది. ఒక దాన్ని పట్టుకున్న తరువాత గాని రెండవ దాన్ని వదిలి పెట్టని గొంగళిపురుగు వంటిది అహంకారం. విషయాలతోనూ భావాలతోనూ సంబంధం లేకుండా ఉన్నప్పుడే దాని నిజస్వరూపం వ్యక్తమవుతుంది. కనుక మనం అనుభూత మొనర్చుకోవలసింది ఆ విరామకాలాన్ని.

### అహంకార నిర్మూలన

అహంకారాన్ని పెకలించడమంటే దాని మూలాన్ని వెదకి పట్టుకోడమే కాని వేరు కాదు. అహంకార రూపములో ఉన్న యీ



'మాయ నేను'కు మూలములో వున్నదే 'అసలు నేను'. అది జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు మూడింటిలోనూ ఉన్నది. ఆ మూలస్థానాన్ని కనుగొని అందు నిలిచిపోవడమే కావాలి. అంతవరకే నీ ప్రయత్నం - ఆపైన ఇక ప్రయత్నంతో పనిలేదు.

### అహంకారం నీడవంటిది

నేలమీద కనిపించే మన నీడవంటిది అహంకారం. ఎవరైనా ఆ నీడను ఊడ్చడానికి ప్రయత్నించడం అవివేకం కాదా? ఆత్మ ఒక్కటే సత్యమైనది. పరిమితికలదైతే అది అహంకారం. పరిమితి లేనిదైతే అనంతం, నిత్యసత్యం.

### అహంకారం బిగువు

ప్రతివాడూ అహంకారపు పిడికిలిపట్టులో చిక్కుకొని వున్నాడు. ఆ పట్టును వదిలించుకోవాలంటే, సాధకుడు క్రొత్త వాసనలు సృష్టించుకోకుండా వుండడం అవసరం.

### అహంకారోత్పత్తి

గాఢనిద్రలో నీకు ప్రపంచం లేదు, కాని నీవున్నావు. సుఖంగా కూడా ఉన్నావు. నిద్రనుండి మేల్కొంచిన తరువాతనే నీకు సుఖం పోయింది. ఎందువలన? మేలుకోవడంతో అహంకారమనేది క్రొత్తగా వచ్చింది. నిద్రలో ఈ అహంకారం లేదు. అహంకారం పుట్టుకే వ్యక్తి పుట్టుకగా చెప్పబడుతున్నది. అహంకారాన్ని నశింపజేస్తే మిగిలేది ఆత్మ, ఆత్మానందమే.

## Nature: A Silent Teacher

Prof. K. Subrahmanian

*The Indian ideal has always been to live in tune with Nature. Everything in the universe is considered Divine by us. The Divinity of everything can be realised only by realising oneself, our sages have said. When there is harmony within, one will experience harmony everywhere. The rishis lived in harmony with everything around them.*

### For Everyone's Need, But Not Greed

The West believes in conquering Nature. Western man exploits Nature for his comfort and convenience and the whole world is paying a heavy price for such an attitude. Industrial nations have polluted the environment. We have begun to indulge in platitudes regarding ecological balance which we have upset through our greed. There in enough for everyone's need in this world, but not enough for everyone's greed. Exploitation of various kinds has rendered the world into an uninhabitable place.

### High-Minded Orientation

*Silent Spring* is a book written by Rachel Carson. It is a valid portrait of the changing shape of life on earth as a result of indiscriminate use of pesticides. She says: "Through all these new, imaginative and creative approaches to the problem of sharing our earth with other creatures there runs a constant theme, the awareness that we are dealing with life – with living populations and all their pressures and counterpressures, their surges and recessions. Only by taking account of such life forces and



by cautiously seeking to guide them into channels favourable to ourselves can we hope to achieve a reasonable accommodation between the insect hordes and ourselves".

